ప్రజాశక్తి

ఆదివారం 14 జులై 2024 | 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కుండపోతగా వర్షం

దుగ్గిరాలలో రికార్డు స్థాయిలో 148.8 ఎంఎం నమోదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దుగ్గిరాల, గుంటూరు, తెనాలి, కొల్లిపర, చేబ్రోలు, ఫిరంగిపురం,పెదకాకాని, పత్తిపాడు మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది.భారీ వర్షాలతో తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లోని పొలాల్లో నీరు నిలిచింది. దుగ్గిరాలలో ఎటుచూసినా వర్షం నీరు కన్పించింది. సాగుకుసిద్ధం చేసిన భూముల్లో భారీ వర్షం కురిసి ఇసుకమేటలు, వండ్రు మట్టి చేరడంతో రైతులు మళ్లీపొలాలను సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గుంటూరు నగరంలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో మున్సిపల్ కార్పొరేషన్ వెనకాల ఉన్న ఫిష్ మార్కెట్ మొత్తం జలమయం అయింది. లక్షల రూపాయలు విలువ చేసే మత్స్య సంపద మురికినీటి పాలు అయిందని చేపల వ్యాపారస్తుల ఆందోళన వ్యక్తం చేశారు. చేపల మార్కెట్ కూడలి మొత్తం ఆరు అడుగుల మేరకునీరు చేరడంతో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మార్కెట్ చుట్టుపక్కల పడిన వర్షపు నీరంత మార్కెట్లోకి వస్తుందని వాపోతున్నారు. నీటిని తోడే మోటార్ సైతం నీటిలో మునిగిపోయిందని వ్యాపారులు తెలిపారు. అలాగే కూరగాయల మార్కెట్, రైతు బజార్లు, ఇతర కాలనీలన్నీ నీట మునిగాయి. వర్షం నీరు చేరి వాహన దారులకు, పాద చారులకు ఇబ్బంది

దుగ్గిరాలలో జలమయంగా మారిన వెద సాగు వరిపొలంలో నీటిని బయటకు పంపేందుకు రైతు ప్రయత్నం

▶ 2లో

గుంటూరు, పల్నాడు జిల్లాలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

గుంటూరు పశ్చిమ 142.2	వట్టిచెరకూరు 86.6	తాడికొండ 37.2	చిలకలూరిపేట 32.6
గుంటూరు తూర్పులో 136.2	ప్రత్తిపాడు 85.4	మంగళగిరి 33.0	రాజుపాలెం 26.8
తెనాలిలో 123.4	మేడికొండూరు 80.6	తుళ్లూరు 29.8	బెల్లంకొండ 18.4
కొల్లిపరలో 115	పొన్నూరు 48.0	నరసరావుపేట 60.4	పిడుగురాళ్ల 17.4
చేబ్రోలులో 107	పెదనందిపాడు 42.4	ముప్పాళ్ళ 47.4	శ్యావల్యాపురం 17.2
ఫిరంగిపురం 105	తాడేపల్లి 37.6	రొంపిచర్ల 43.2	వినుకొండ 16.6
పెదకాకాని 103.4	కాకుమాను 37.2	సత్తెనపల్లి 43.0	అమరావతి 14.6
		నాదెండ్ల 40.6	ఈపూరు 14.4
		ఎడ్లపాడు 35.4	బొల్లాపల్లి 13.6

ఇద్దరు ఎస్‌పిల బదిలీ

- గుంటూరుకు సతీష్‌కుమార్, పల్నాడుకు శ్రీనివాసరావు నియామకం
- బాపట్లకు తుషార్‌దూడి, విజయనగరం బెటాలియన్‌కు మల్లిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎస్. సతీష్‌కుమార్ (గుంటూరు జిల్లా ఎస్‌పి)

కె. శ్రీనివాసరావు (పల్నాడు జిల్లా ఎస్‌పి)

గుంటూరు జిల్లాకు నూతన ఎస్‌పిగా ఎస్.సతీష్‌కుమార్,పల్నాడు జిల్లా ఎస్‌పిగా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ప్రస్తుత గుంటూరు ఎస్‌పి తుషార్ దూడిని బాపట్ల జిల్లాకు బదిలీ చేయగా, పల్నాడు జిల్లా ఎస్‌పి మల్లికాగర్గ్‌ను విజయనగరం ఎపిఎస్‌పి కమాండ డెంట్‌గా నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సతీష్‌కుమార్ 2016 ఐపిఎస్ బ్యాచ్‌కి చెందిన అధికారి కాగా ఆయన ప్రస్తుతం కాకినాడ జిల్లా ఎస్‌పిగా పనిచేస్తూ గుంటూ రుకు బదిలీ అయ్యారు. ఆయన అంతకు ముందు విశాఖపట్నం జిల్లా చింతపల్లి అటవీ ప్రాంతంలో ఎఎస్‌పిగా పనిచేశారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా ప్రజలకు బాగా చేరువ య్యారు. తరువాత పదోన్నతిపై కాకినాడ ఎస్‌పిగా బదిలీ అయ్యారు.కాకినాడలో ఆయన ప్రజా సంబంధాలు బాగా మెరుగుపర్చారని తెలిసింది. అలాగే విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో ఆయన జగ్గయ్యపేట డిసిపిగా పనిచేస్తున్నారు. పోలీసుశాఖలో డిఎస్‌పిగా చేరి అంచెలంచెలుగా పదోన్నతిపై ఐపిఎస్ అధికారి అయ్యారు. విజయవాడ డిసిపిగా సమర్ధవంతంగా పనిచేశారన్న పేరు ఉండటంతో ఆయన్ను కీలకమైన పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు గుంటూరు ఎస్‌పిగా పనిచేసిన తుషార్ దూడి ఫిబ్రవరి 1న బాధ్యతలు స్వీకరించారు. 2018 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన తుషార్ కడపలో అదనపు ఎస్‌పిగా పనిచేస్తూ ఎన్నికల ముందు గుంటూరు వచ్చారు.ఎన్నికలను సమర్థవం తంగా నిర్వహించినా ఆయనకు ఐదునెలలకే బదిలీ వచ్చింది. పల్నాడు ఎస్‌పిగా మే 19న బాధ్యతలు స్వీకరించిన మల్లికా గర్గ్‌కు రెండు నెలలు తిరగకుండానే బదిలీ బహుమతిగా

2 లో

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

ఆసుపత్రిలో చేరిన నిండు గర్భిణి మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువులు ఆందోళన

న్యాయం చేస్తామని ఆసుపత్రి వర్గాల హామీతో విరమణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరికి పట్టణంలో రత్నాల చెరువులో నివసిస్తున్న తొమ్మిది నెలల నిండు గర్భిణి కాన్పు కోసం వైద్య పరీక్షలకు వెళ్లగా డాక్టర్ల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు పోయిన ఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని భర్త గోపాలకృష్ణ , కుటుంబ సభ్యులకు ఆందోళన చేపట్టారు. భర్త మైల గోపికృష్ణ మాట్లాడుతూ పెదకాకాని మండల పరిధిలో గల కాళీ గార్డెన్స్, ఎస్ ఎస్ ఎస్ హెచ్ కె వి పి బి ట్రస్ట్ హాస్పిటల్ లో ట్రీట్మెంట్ కోసం జాయిన్ చేశామని చెప్పారు. తల్లి బిడ్డకు ఎటువంటి ప్రమాదం లేదని అంతా క్షేమంగానే ఉందని శుక్రవారం మధ్యాహ్నం నుండి డాక్టర్ చెప్పారన్నారు. శనివారం తెల్లవారు జామున 3 గంటలకు ఆసుపత్రి సిబ్బంది తల్లి, బిడ్డ ఇద్దరూ మృతి చెందారని, మృతదేహాల్ని తీసుకెళ్లాలని చెప్పినట్లుగా తెలిపారు. అప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేయించారని తెలిపారు. రాత్రి అంతా బాగానే ఉందని చెప్పి ఇప్పుడు ఎలా చనిపోయిందని బంధువులు ప్రశ్నించగా... ఆసుపత్రి సిబ్బంది ఎటువంటి సమాధానం చెప్పకపోవడం పోవడంతో ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన చేసినట్లుగా తెలిపారు. కొన్ని గంటలపాటు ఆందోళన చేసిన తర్వాత ఆసుపత్రి యాజమాన్యం బాధితులతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లుగా గోపాలకృష్ణ తెలిపారు.

నేడు 'పోలవరం'పై సదస్సు

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ

సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు 'పోలవరం'పై సదస్సు జరుగుతుంది. 'పోలవరం ప్రాజెక్టు - రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేసిన శ్వేతపత్రం'పై వక్తలు మాట్లాడతారు. విజయవాడ గవర్నరుపేట ఎంబి విజ్ఞాన కేంద్రం సమీపంలోని బాలోత్సవ భవనం రెండో అంతస్తులో జరిగే ఈ సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, 'ఆదివాసుల జల సమాధి పోలవరం' రచయిత ఆర్.ఉమామహేశ్వరి, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంత మండలాల నాయకులు పాల్గొంటారు.

డయేరియాకి కారణం బోర్లలో నైట్రేట్

- పిడుగురాళ్ళలో పర్యటించిన మంత్రి పి.నారాయణ
- చికిత్స పొందుతున్న బాధితులకు పరామర్శ
- అధికారుల పనితీరుపై అసంతృప్తి
- మురుగు కాల్వలను శుభ్రపరిచిన మంత్రి

6లో

గుంటూరులో జిఒ కాపీలు దగ్ధం చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

జిపిఎస్ జిఒ 54ను వెంటనే ఉపసంహరించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జీవో కాపీలు దహనం

ప్రజాశక్తి-గుంటూరు

పాత పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న లక్షలాది ఉద్యోగుల ఆశలను కాలరాస్తూ పాత తేదీతో ప్రభుత్వం విడుదల చేసిన జిపిఎస్ అమలు జిఒ 54ను తక్షణమే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒ పట్ల యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు నిరసన తెలిపి అనంతరం జిఒ కాపీలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నియంతృత్వ ధోరణితో వ్యవహరించి, తగిన మూల్యం చెల్లించుకుందని, ఈ ప్రభుత్వమైనా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని అన్నారు. లేనిపక్షంలో తిరిగి పోరాటం ప్రారంభించక తప్పదని అన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ 2017లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సి ద్వారా నియామకాలు పొందిన ఉపాధ్యాయులు అందరికీ తక్షణమే పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. సిపిఎస్ కన్వీనర్ సిహెచ్.ఆదినారాయణ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్ప సిపిఎస్, జిపిఎస్‌లను అంగీకరించేది లేదన్నారు. బలవంతంగా అమలు చేయాలని చూస్తే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షులు ఏఎల్ శివపార్వతి జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, యం.గోవిందు, యం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుండపోతగా వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడింది. గుంటూరు కంకర గుంట ఆర్‌యూబిలోకి వర్షం నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.జిల్లాలోని కొన్ని మండలాల్లో ఒక నెల రోజుల్లో కురవాల్సిన వర్షం ఒక్క రోజులోనే కురిసింది. దుగ్గిరాల మండలంలో అత్యధికంగా 148.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి. అయితే వర్షాలు సాగుకు బాగా ఉపయోగపడతాయని భావిస్తున్నారు. డెల్టా ప్రాంతానికి ఇప్పటికే కాల్వలకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు వస్తుండటం, వర్షాలు కూడా విస్తారంగా కురవడం వల్ల రానున్నపక్షం రోజుల్లో వరిసాగుకు అవకాశాలు బాగా మెరుగుపడ్డాయి. అలాగే ఇప్పటికే సాగు చేసిన పత్తి, ఇతర పంటలకు ఈ వర్షం మేలు చేసింది. పల్నాడు జిల్లా నర్సరావుపేట, ముప్పాళ్ల, సత్తెనపల్లి, రొంపిచర్ల తదితర ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురవగా మిగతా మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నర సరావుపేటలో అత్యధికంగా 60 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. పల్నాడు జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి 18 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదయింది. అలాగే పల్నాడు జిల్లాలో జూలై నెలలో 147 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 42 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. పల్నాడు జిల్లాలో మెట్ట పంటలకు వర్షం మేలు చేసింది. ప్రధానంగా పత్తి,మిర్చిసాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి.

ఇద్దరు ఎస్‌పిల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

లభించింది. పల్నాడు జిల్లాకు అతి తక్కువ కాలంలో మూడో ఎస్‌పిగా నియమితులైన యువ మహిళా ఐపిఎస్ మల్లికాగర్గ్ ఎన్నికల సమయంలో చెలరేగిన హింసను ఉక్కు పాదంతో అణచివేశారు. మే 13న పోలింగ్ రోజున, తరువాత రెండు రోజుల పాటు హింసాత్మక ఘటనలు పెద్ద ఎత్తున జరగడంతో అప్పటివరకు ఎస్‌పిగా ఉన్న గరికపాటి బిందుమాధవ్‌ను ఎన్నికల కమిషన్ మే 16న సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే మల్లికను ఎన్నికల సంఘం నియమించింది. అతి తక్కువ కాలంలోనే ఆమె పల్నాడు జిల్లాలో శాంతిభద్రతలను అదుపు చేశారు. ఎన్నికలకు సంబంధించి జిల్లాలో జరిగిన ఘర్షణలను నియంత్రిచేందుకు దాదాపు 1360 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఒకేసారి ఇంత మందిని అరెస్టు చేయడంతో జిల్లాల్లో జైళ్లన్ని కిటకిటలాడాయి. అంతేగాక ఎన్నికల ఫలితాల అనంతరం కూడా ప్రత్యర్థులపై దాడులకు పాల్పడే అవకాశం ఉందని ముందే గ్రహించిన ఆమె గత రెండునెలలుగా తీసుకున్న కట్టుదిట్టమైన చర్యల వల్ల పల్నాడులో ప్రస్తుతం శాంతి నెలకొంది. ప్రత్యర్థులపై దాడులకు వెళ్లాలని భావించిన వారు ఎస్‌పిని చూసి వెనుకంజ వేస్తున్నారనే ప్రచారం కూడా జరిగింది. రాజకీయంగా ఎటువంటి సిఫార్సులకు తలొగ్గకుండా విధి నిర్వహణలో రాజీలేని ధోరణితో పనిచేసే ఏ ప్రభుత్వం ఆమెను ఎక్కువకాలం శాంతిభద్రతల విభాగంలో ఉంచదనే వాదన లేకపోలేదు. తాజాగా ఆమె భర్త బాపట్ల ఎస్‌పి వకుల్ జిందాల్‌ను విజయనగరం ఎస్‌పిగా బదిలీ చేసి ఆమెను విజయనగరంలోనే ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. అలాగే ఎన్నికల అల్లర్ల నియంత్రించలేకపోయారన్న అభియోగంపై సస్పెండ్ అయిన పల్నాడు గత ఎస్‌పి గరికపాటి బిందుమాధవ్‌కు కర్నూలు జిల్లా ఎస్‌పిగా నియమితులయ్యారు.

తెనాలిలో భారీ వర్షం... నీట మునిగిన పంట పొలాలు

నేలపాడు రోడ్డులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ప్రజాశక్తి-తెనాలి

బారీ వర్షం పంట పొలాలను జలమయం చేసింది. శుక్రవారం రాత్రి 124 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారుల లెక్కలు చెబుతన్నాయి. ఈ వర్షం రైతుల్లో కొందరికి మేలైనా, కొందరికి ఇబ్బంది కలిగించింది. వెద పద్దతిలో నాటు వేసిన పొల్లాల్లోక 70శాతం ముంపుకు గురైంది. ఇంతటితో వర్షం ఆగితే ఒకింత మేలే. కాని మరింతగా వర్షం పడితే రైతులు మరలా విత్తనాలు చల్లుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. మండలంలో వరి సాగు దాదాపు 13వేల ఎకరాల్లో ఉంది. ఇప్పటికి యాబై శాతం వెద పద్దతిలో నాట్లు వేయగా, మిగిలిన రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఈలోగానే శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి శనివారం ఉదయం 11 గంటల వరకూ ఏకదాటిగా వర్షం కురిసింది. భారీ వర్షానికి పంట పొలాలు జలమయమయ్యాయి. చేలల్లో భారీగా వర్షపునీరు చేరింది. ఈ వర్షం కొంత మంది రైతులకు మేలైనా, మరికొంత మందికి ఇబ్బందికరమేనని అధికారులు అంటున్నారు. విత్తనాలు చల్లాల్సిన రైతులు ఈ తడి పోయేంతవరకూ ఆగాల్సిందే. అయితే ప్రస్తుతం రైతులు నీటిని పొలాల్లోంచి బయటకు పెట్టుకునే పనిలో ఉన్నారు. వర్షం ఇంతటితో ఆగితే రైతులు కొంత ఊపిరి పీల్చుకుంటారు. లేదంటే మరలా విత్తనాలు చల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మూడు నాలుగు రోజుల క్రితం వెద పెట్టిన రైతులు మాత్రం ఇబ్బంది తప్పదంటున్నారు. మండల గ్రామాల్లో పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

నీరు బయటకు పంపే పనిలో రైతులు నిమగ్నం

పొలాల్లో నీటిని బయటకు పెట్టుకోవాలి

జి.ప్రేమ్‌సాగర్, మండల వ్యవసాయాధికారి, తెనాలి

మండలంలో శుక్రవారం రాత్రి నుంచి 124 మి.మీ.వర్షం కురిసింది. పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. పొలాలను పరిశీలించాం. ఇప్పటికి రైతులు వెద పద్దతిలో దాదాపు 50 శాతం నాట్లు వేశారు. తక్షణమే నీటిని బయటకు పెట్టుకోవాలి. మొలకను గమనించుకోవాలి. మూడు నాలుగు రోజుల క్రితం వెద పెట్టిన విత్తనం దెబ్బతినే అవకాశం ఉంది. అలాంటి వారు నేల ఆరగానే మరలా వెద్ద పెట్టుకోవాలి. ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే వరి నారుతో నాట్లు వేసుకోవాల్సి ఉంటుంది.

నిండా మునిగిన చేలు

నీటిని బయటకు పంపించేందుకు ఇబ్బంది పడుతున్న రైతులు

గండ్లు పడకుండా అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

ప్రజాశక్తి దుగ్గిరాల

ఎడతెరిపి లేకుండా శుక్రవారం రాత్రి నుండి శనివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి వెదసాగులో వరి విత్తనాలు నాటిన చేలు నీటిలో మునిగిపోయాయి. ఈ వర్షమే అధికమని ఇంకా ఎక్కువగా వర్షం కురిసినట్లయితే విత్తనాలు కుళ్ళిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం ఇదే జరిగినది అధిక వర్షాలకు మొలకెత్తిన నారు నిలిచినది. మొలకెత్తని విత్తనాలు కల్లి పోయాయి. రైతులు రెండవసారి విత్తుకోవలసి వచ్చినది. దీనితో చేలలో నీరు బయటకు పంపేందుకు వర్షానికి సైతం లెక్కచేయకుండా రైతులు నాన అవస్థలు పడుతున్నారు. మరో ప్రక్క బంగాళాఖాతంలో 15వ తేదీ నుండి 22వ తేదీ వరకు రెండు అల్ప పీడనాలు పడే అవకాశం ఉందని దీని ప్రభావం వలన పది రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వారు చేస్తున్న హెచ్చరికలను రైతులను కలవరపరుస్తున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 22 వేల ఎకరాలలో ఇప్పటికే దాదాపు 20వేల ఎకరాలలో వెద పద్ధతిన విత్తనాలు చల్లడం పూర్తయినది. మండల కేంద్రం దుగ్గిరాలలో 148.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనది. కృష్ణానది పరివాహక ప్రాం తాలలో కురుస్తున్న వర్షాలకు నదిలో అకస్మాత్తుగా నీటి ప్రవాహం పెరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులకు చేరటంతో శనివారం కష్ణ పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ బకింగ్ హామ్ కెనాల్ కు దాదాపు 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జల వనరుల శాఖ డి ఈ ఎన్ కెవి ప్రసాద్ ఏ ఈ ఈ వి వనిత సెంట్రల్ సబ్ డివిజన్ ప్రధాన కేంద్రం దుగ్గిరాలకు వచ్చి కాలువలకు నీటిని విడుదల చేశారు. రేపల్లె కాలువకు 500 క్యూసెక్కులు హై లెవెల్ ఛానల్ కు 50 క్యూసెక్కుల నీటిని మిగిలిన మొత్తాన్ని తుంగభద్ర కాలువకు విడుదల చేశారు. అయితే కాలువలకు నీటిని వదల వద్దని చేలలో నీరు బయటకు వెళ్లాలని రైతుల నుండి చరవాణిల ద్వారా విజ్ఞప్తులు క్రమం తప్పకుండా వస్తున్నాయి. దీనితో ఆ కాలవలకు నీటిమట్టం తగ్గించి నిజాంపట్నం పడవల కాలువకు నీటిని విడుదల చేసి తుంగభద్ర కాలువకు విడుదల చేస్తున్న నీటిని పెంచారు. ప్రకాశం బ్యారేజ్ దిగువ భాగానికి నీటిని విడుదల చేయటం లేదని దీనితో కాలువలకు అధికంగా నీరు వచ్చే అవకాశం ఉందని గండ్లు పడకుండా అప్రమత్తంగా ఉండాలని డిఈ యంత్రాంగాన్ని కోరారు. రేపల్లె బాపట్ల అధికారులకు కూడా చరవాణి ద్వారా సమాచారాన్ని అందించారు.

దుగ్గిరాలలో నీట మునిగిన చేను

దిగువకు నీటిని వదులుతున్న అధికారులు

కుల నిర్మూలనతోనే సమ సమాజం

రిటైర్డు ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.వి.రమేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారత దేశంలో కుల నిర్మూలనతోనే సమ సమాజం సాధ్యమని రిటైర్డు ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.వి.రమేష్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ,- జాషువా - పూలే - పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ అధ్యక్షతన నగరంలోని అరండల్ పేటలోని సిపిఎం హాలులో కుల నిర్మూలనా 800 ప్రతులు ఆవిష్కరణ సభ జరిగింది. కుల నిర్మూలన పుస్తక ప్రతుల ఆవిష్కరణ అనంతరం పి.వి.రమేష్ మాట్లాడుతూ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పోరాటాలు ఒకే ఒరవడిలో జరగాలని విశ్లేషించారు. అంబేద్కర్ జీవించిన కాలంలో మతాలు చా తక్కువని ప్రధానంగా కుళాలే సమాజంగా ఉందని వివరించారు. దేశంలో బుద్ధిజం ఒక్కటే దేవుడు లేకుండా నైతికంగా ఎలా జీవించాలో మార్గం చూపించందని అన్నారు. కుల నిర్మూలన పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదివి తీరాలన్నారు. బ్రిటిష్ వారు వచ్చిన తర్వాతే కులం గురించి అధ్యయనం బాగా పెరిగిందన్నారు. 19వ శతాబ్ది నుండి కుల వ్యవస్థలో మార్పులు జరగడం ఎక్కువై%శీ%దన్నారు. కుల నిర్మూలన జరిగి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, వీసికే పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.జయసుధ, కొరివి వినయ్ కుమార్, పాటిబండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వర్షాలపై అధికారుల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో భారీ వర్షం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్న ప్రాంతాల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం పర్యటించారు. దేవాపురంలో పలు ప్రాంతాలను సందర్శించారు. తొలుత దేవాపురం 5వ లైన్ లోని పీకలవాగు గోడకు ఆనుకొని ఉన్న 2 బడ్డీకోట్లు వర్షం ధాటికి వాగులో పడిపోయి, నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిపోయాయని, వాగు మీద చెప్టా కూడా ప్రమాదకరంగా తయారయ్యింది అని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా దేవాపురం 4వ లైన్ లో భారీగా చెత్తా కొట్టుకొని వచ్చి, చెప్టాల క్రింద నిలిచిపోవటం వలన ఆ మురుగు నీరు మొత్తం రోడ్ల మీద ప్రవహిస్తున్నదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దష్టికి తీసుకువచ్చారు.ఎమ్మెల్యే మాధవి అధికారులతో మాట్లాడుతూ పీకలవాగు, డ్రైనేజి సమస్యలను పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వర్షాకాలములో చాలా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు.పీకలవాగు వలన ప్రజలు ఇబ్బందులు ప్రాంతాల్లో అవసర మయిన సైడు గోడలు రోడ్ల నిర్మాణాలకు అవసరమ యిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోపురి నరేంద్ర,చింతకాయల శివ,వెంకటేష్ యాదవ్ అలివేలమ్మ,వినోద్, వెంకటేశ్వర్లు, గోపి, చంద్రశేఖర్, ప్రశాంత్,డేగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయపురిసౌత్

అనారోగ్య కారణాల వల్ల ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన శనివారం మాచర్ల మండలం పరిధిలోని బైరవునిపాడు గ్రామం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల బ్రహ్మ రెడ్డి (40) గత కొంతకాలంగా పక్షవాతంతో బాద పడుతున్నాడు. తనకు కలిగిన అనారోగ్యనికి చింతిస్తూ శుక్ర వారం ఇంటి నుండి మాచర్ల వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి, బైరవునిపాడు సమీపంలోని నాగిరెడ్డి హోటల్ వెనుక పొలాల్లో పురుగు ముందు తాగి మృతి చెందాడు. మృతుడు తండ్రి దగ్గుల చినపేరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బ్రహ్మారెడ్డి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పిడుగురాళ్ళ సిఐగా వెంకట్రావ్

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

పిడుగురాళ్ళ సిఐగా వెంకట్రావ్ శనివారం భాద్యతలు చేపట్టారు.ప్రస్తుతం పిడుగురాళ్ళ సిఐగా విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు బదిలీపై గుంటూరు విఆర్‌కు వెళ్ళారు. గుంటూరు నుండి బదిలీపై వెంకట్రావ్ పిడుగురాళ్ళకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా సిఐను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గర్భిణి, ఆమె కొడుకుపై హత్యాయత్నం

ప్రజాశక్తి-ఈపూరు

వైద్యుని వద్దకు వెళ్దామని చెప్పి నమ్మించి గర్భిణి, ఆమె కొడుకు పై హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని ఎ.ముప్పాళ్ళ గ్రామం వద్ద గల అద్దంకి బ్రాంచ్ కాలువ పవర్ ప్లాంట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ మహబూబ్ నగర్ జిల్లా మరికల్ మండలం రాకొండ గ్రామానికి చెందిన భూపతి శైలజ, భర్త అనిల్ కుమార్,కుమారుడు భూపతి శివ తో హైదరాబాదు గచ్చిబౌలిలో కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం భర్త చనిపోవడంతో శైలజ,శివ అక్కడే కూలి పనులు చేసుకుంటూ ఉంటున్నారు. అదే ప్రాంతంలో పనులు చేసుకుంటున్న ఈపూరు మండలం ఎ.ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ముద్దా శ్రీనుతో శైలజకు పరిచయం ఏర్పడింది.

మూడేళ్లుగా శీనుతో ఆమె సహజీవనం చేస్తోంది. అయితే, ఎనిమిది నెలల గర్భిణి అయిన శైలజను ఆసు పత్రిలో చూపిస్తానంటూ తల్లి, కుమారుడని 20 రోజుల క్రితం హైదరాబాద్ నుండి నరసరావుపేటకు మకాం మార్చి అక్కడే ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఎలాగైనా ఇద్దరిని హత్య చేయాలని ప్రణాళిక రచించిన శ్రీను, తన గ్రామం ముప్పాళ్ళలో మంచి వైద్యుడు ఉన్నాడని చూపిస్తానని నమ్మబలికి తల్లిని, కుమారుడిని ద్విచక్ర వాహనంపై తీసుకొని అద్దంకి బ్రాంచ్ కాలువ సమీపంలోకి రాగానే, రోడ్డుపై శివను దింపాడు. అతన్ని అక్కడే ఉండమని చెప్పి, శైలజను వైద్యుడికి చూపించి వస్తానంటూ ద్విచక్ర వాహనంపై ఆమెను తీసుకొని కాల్వకట్టవైపు వెళ్లాడు. అనుమానం వచ్చిన శైలజ, అతన్ని నిలదీయడంతో ఆమెను చంపేందుకు గొంతు నులమడంతో శైలజ స్పృహ తప్పి పడిపోయింది. ఆమె చనిపోయిందని భావించి ముందుగానే ఏర్పాటు చేసుకున్న గుంతలో శైలజను పడేశాడు. అయితే, కొంచెం సేపటికి స్పృహలోకి వచ్చిన శైలజ, భయంతో ముళ్ళ పొదల చాటున దాక్కుంది. 'తల్లి వద్దకు వెళ్దాం' అంటూ శివను అదే ప్రాంతానికి తీసుకు వచ్చి గొంతు నులమడంతో కేకలు వేయడం, శైలజ సమీపంలోని పవర్ ప్లాంట్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న వ్యక్తులకు ఈ విషయాన్ని చెప్పింది. టార్చ్

సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రూరల్ సిఐ యు.సుధాకర్

లైట్లతో వారు కేకలు వేస్తూ ఘటన ప్రాం తానికి చేరుకోవడంతో శివను వదిలేసి శ్రీను పరా రయ్యాడు. ఈ సమాచారం మేరకు పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకొని శైలజ,శివ లను పోలీస్‌స్టేషన్ కి తరలించారు. వినుకొండ రూరల్ సిఐ యు.సుధాకర్, ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ శనివారం ఉదయం సం ఘటన ప్రాంతంలో ఉన్న గుంతను పరి శీలించారు. శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

పల్నాడు జిల్లా, మండల కేంద్రం రొంపిచర్ల, R/o D.No.5-22 కు చెందిన కోట నాగమల్లేశ్వరి w/o సత్యనారాయణ అను నేను యావన్మందికి తెలియ జేయునది ఏమనగా రొంపిచర్లలో సర్వే నెం.696/బి లో కొనుగోలు చేసి నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పొందిన డాక్యుమెంట్ నెం. 1529/2011 గల ఒరిజినల్ దస్తావేజులు మరియు లింక్ డాక్యుమెంట్‌తో ది.10-07-2024న రొంపిచర్ల నుండి బస్సులో నరసరావుపేట వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల పైఅడ్రస్‌లో లేదా 8333934585 నెం.లో సంప్రదించగలరు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికి వాటిని దుర్వినియోగం పరిస్తే చట్టపరంగా నేను తీసుకును చర్యలకు బాధ్యులగుదురు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT, NARASARAOPET (SENIOR DIVISION)
AS.NO 227/24

Between:
లావు పద్మావతి - (D1)
గోరంట్ల సుష్మ. - (D3)... అప్పిలెంట్స్
AND
ముదంబునూరు శకుంతల. ....
లావు వీరేంద్ర - (D2) ... ప్లయింటిఫ్/ రెస్పాండెంట్స్
R2) లావు వీరేంద్ర, (age 32) S/o వెంకటేశ్వర్లు (లేటు), సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ ప్రక్కన నరసరావుపేట సెంటర్ చిలకలూరిపేట పట్టణం మరియు మండలం పల్నాడు జిల్లా, AP.

పై అప్పిలు నెం. 227/24 నందు నేను అప్పిలెంటు అయి ఉన్నాను. సదరు అప్పీలు నందు రెస్పాండెంట్ R2 అయిన లావు వీరేంద్ర అను రెస్పాండెంట్ కు శ్రీయుత కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినను తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా సబ్టిట్యూట్ సర్వీస్ ద్వారా మీకు తెలియపరచడమై నది. కావున రెస్పాండెంట్ 2 అయిన మీరు ది. 12-08-2024 వ తేదీన ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా కానీ మీ వకీలు ద్వారా కానీ శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియపరచడమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదాతేది. 12-08-2024

ఇట్లు.
బండ్ల గోపి, అడ్వకేట్,
డోర్ నెం.130-5-177 ,
గోరంట్ల, అన్నపూర్ణ నగర్ 5వ లైన్,
గుంటూరు. Cell.No 9885402037.

ఇల్లు కూలి.. గాయపడిన మహిళ

ఆర్థికసాయం అందజేసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాలలోని రామా నగర్‌లో శనివారం ఉదయం 5 గంటల సమయంలో ఇల్లు కూలి ఆరేపల్లి కౌసల్య అనే మహిళ తలకు గాయమైంది. కూలిన ఇంటి ప్రక్కనే ఉన్న అప్పారావుకు చెందిన ఇంటి గోడ కూలి బాధితుల ఇంటిపై పడింది. అప్పారావు ప్రస్తుతం గ్రామంలో లేదని సమాచారం. కూలిన ఇంట్లో తల్లీకూతురు ఇద్దరు ఉన్నారు. గోడ కూలిన వెంటనే వాళ్లిద్దరూ బయటకు వచ్చేశారు. ఆ తర్వాత ఇల్లు కూలి పోయింది. గ్రామ కార్యదర్శి ఎం శరత్ విఆర్ఓ ఫకీరయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి అధికారులకు ఈ విషయాన్ని తెలియజేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లూరు నరసింహారావు బాధిత మహిళను పరామర్శించి రూ.3 వేల నగదును అందించారు. ఈ ఘటనను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబానికి ఆదుకుంటామన్నారు. టిడిపి నాయకులు నవీన్ గౌడ్, పి. సాయికృష్ణ, ఎం. చిరంజీవి, రామ కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఓ.యస్. నెం. 60/2022

కాకుమాను అమరేశ్వరరావు ....వాది
మరియు
కొత్త మణిదీప్ తండ్రి : రమేష్‌బాబు ..... ప్రతివాది
వయస్సు 35 సంIIలు, వ్యాపారం, నివాసం : కల్యాణి హరివిల్లు అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం.405, 3వ ఫ్లోర్, టిటిడి కళ్యాణమండపం దగ్గర, పిడుగురాళ్ళ

ఈ దావాలో కొత్త మణిదీప్‌కు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినప్పటికిన్నీ వారు వాటిని దురుద్దేపూర్వకంగా తీసుకొనక తిరిగి పంపుచున్నందు వలన వారికి నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది: 31-7-2024నకు వాయిదా వేసినారు. కావున మీరు ఆ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై పై దావాలో మీ ఆక్షేపణలను తెలియజేయగలరు. లేనియెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించెందరని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

Madasu Venkateswara Rao,
M.A., LL.B.,
Advocate,
Piduguralla- 522423.
Cell No : 9908464246.

స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలి

ప్రైవేట్ పరం కాకుండా చూడటం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత: అవగాహన సంస్థ విజ్ఞప్తి

ప్రజాశక్తి-గుంటూరు

'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అని నినదించిన 32 మంది యువకిశోరాల ప్రాణత్యాగంతో సాధంచుకున్న స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరంగా కాకుండా ఉండాలంటే ప్రధాని మోదీ విస్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేసింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రశ్నే లేదని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి మీడియా సమావేశంలో పేర్కొనడం సంతోషకరమే అయినా, ప్రధాని నిర్ణయంతోనే ఇది సాధ్యమవుతుందని అభిప్రాయపడింది. అశేష త్యాగాలతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని పేర్కొంది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మూడున్నరేళ్లుగా పోరాడుతున్నారని తెలిపింది. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలనే కొనసాగించాలని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని, ఇప్పుడు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రైవేటీకరణను ఉపసంహరింపజేయడం తెలుగుదేశం పార్టీ విద్యుక్తధర్మం అని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకుని, ప్రధాని మోదీని ఒప్పించి లేదా ఒత్తిడి తెచ్చి, ఏవిధంగానైనా స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేసింది.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇ.పి. 44/2023 ఇన్ ఓ.యస్. 232/2019

పిటీషనర్ / డిహెచ్‌ఆర్ : లఘువరపు వెంకటేశ్వర్లు
రెస్పాండెంట్ / జెడిఆర్ :
కొనకండ్ల కాశిరామారావు వురఫ్ మల్లేశ్వరరావు, తండ్రి : పూర్ణచంద్రరావు, దత్తు తండ్రి : వెంకటేశ్వర్లు వురఫ్ బంగారుకొండ, సాII నేతాజీనగర్, పిడుగురాళ్ళ - 522413.

పై నెంబరులో పిటీషనరు తన డిక్రీ బాకీ రాబట్టుకొను నిమిత్తం పై నెంబరులో ఇ.పి. దాఖలు చేసియుండగా రెస్పాండెంటుకి నోటీసు నిమిత్తం ది. 31-7-2024కి వాయిదా అయివున్నది. కావున రెస్పాండెంట్ సదరు తేదీన పై కోర్టులో ఉదయం 10-30 గం.ల నుండి హాజరులో వుండి తన ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల తన పరోక్షమందు కేసు తీర్మానించబడును.
(బై ఆర్డర్ ఆఫ్ కోర్ట్)

ఎం.లక్ష్మీ నాగారపమ్మ,
అడ్వకేట్,
పిడుగురాళ్ళ - 522413.
సెల్ నెం : 9885035446

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE COURT, NARASARAOPET. (SENIOR DIVISION)
HMOP.NO 82/23

Between:
చిలకా సాగర్ కుమార్ ...పిటీషినర్
AND
చిలకా దీప్తి ... రెస్పాండెంట్
రెస్పాండెంట్:
చిలకా దీప్తి, w/o చిలకా సాగర్ కుమార్, D.No. 3-45, సీతారామపురం మైన్స్ రోడ్డు, కొండమోడు గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా, AP.

పై నెం.HMOP నందు 82/23 నందు నేను పిటిషనర్ అయి ఉన్నాను. పై నెం.HMOP నందు రెస్పాండెంట్‌కు శ్రీయుత కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినను తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా మీకు తెలియ పరచడమై నది. కావున రెస్పాండెంట్ అయిన మీరు ది. 9-08-2024 వ తేదీన ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా కానీ మీ వకీలు ద్వారా కానీ శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియపరచడమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదాతేది: 9-08-2024

ఇట్లు.
P.Chakrapani, B.Com,LLB,
Advocate,
KBR Complex, Shop.No 64,
Station Road, NARASARAOPET.
Cell No. 9885644203

ప్రకటన

నా క్లయింటు State Bank of India, RACPC, Vijayawada వారి సంజాయిషీ పొంది ఇందు మూలంగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా..
ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 08-07-2020న శ్రీ మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 2681/2020 రుగా రిజిస్టర్డు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా 1) జంజనం శ్రీనివాసరావు గారి భార్య జంజనం మంగమ్మ 2) మాడపాటి యశోదరావు గారి కుమారుడు మాడపాటి నరేంద్రబాబు గార్లు క్రయము పొంది తదాది సదరాస్తిని సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారని తెలుపుచున్నారు. కాగా షెడ్యూలు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన శ్రీ మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 3652/1993, ది. 13-09-1993 మరియు 3402/1993, ది. 19-08-1993 ర్లు గల విక్రయ దస్తావేజులు పోయినవని తెలుపుచున్నారు.
కాగా 1) జంజనం శ్రీనివాసరావు గారి భార్య జంజనం మంగమ్మ 2) మాడపాటి యశోదరావు గారి కుమారుడు మాడపాటి నరేంద్రబాబు గార్ల వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయము పొందుటకు ఎనిబెర ప్రశాంత్ గారు ది. 10-06-2024న క్రయము ఖరారు చేసుకొనియున్నారు. సదరు ఆస్తిని కొనుగోలు చేయుటకు ఋణసదుపాయము పొందుటకు, సదరాస్తిని కొనుగోలు చేసిన దరిమిలా సదరాస్తిని బ్యాంక్ వారికి తనఖా చేయుటకు State Bank of India, RACPC, Vijayawada వారికి అభ్యర్ధన చేసియున్నారు.
కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్థిపై ఎవరికైననూ ఏ విధమైన హక్కులుగాని, చట్టరీత్యా చెల్లదగు క్లయిములు గాని, మరి ఏవిధమైన అభ్యంతరములు గాని, ఉన్న యెడల, వారు ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వక ఆధారములతో తెలియపరచగలరు. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములుగాని రాని యెడల, మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని హామీగా స్వీకరించి ఋణ సదుపాయము కలుగజేయుదురు. ఆ దర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లయములుగానీ, నా క్లయింట్లును గాని, షెడ్యూలు ఆస్థిని గాని బైండు చేయజాలవని, మా క్లయింటు షెడ్యూలు ఆస్తిపై పొందు హామీ మరియు తనఖా హక్కులను భంగము చేయజాలవనియూ, ఇందుమూలముగా తెలియచేయటమైనది.
షెడ్యూలు : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, తాడేపల్లి మండలం, ఉండవల్లి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన ఉండవల్లి గ్రామ డి.నెం. 168/1రు, ప్లాట్ నెం. 18రు, సమీప డోర్ నెం. 3-340/4రు దాఖలా చ.గ. 200.61 లు
స్థిరాస్తికి హద్దులు : తూర్పు : అ. 33-0లు వెడల్పు గల రోడ్డు - అ. 39.3 లు, **దక్షిణం :** గొట్టిముక్కల వెంకటేశ్వరమ్మ గారి ఆస్తి - అ. 46.0 లు, **పడమర :** బుర్రముక్కు కోటిరెడ్డి గారు వారి వగైరాలకు దఖలు పరచిన ఆస్తి - అ. 39.3 లు, **ఉత్తరం :** ప్లాటు నెం. 19రు దాఖలా ఆస్తి - అ. 46.0 లు.

NIMMAGADDA SRINIVASU, M.A., LL.B.,
ADVOCATE
Door No. 41-3-41/1, Rice Shops Street,
Krishnalanka, Vijayawada - 520013. Cell No : 94406 30396

బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బస్సు షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అచ్చంపేట

స్థానిక మెయిన్ రోడ్ లోని పిహెచ్‌సి వద్ద స్నేహ హస్తాల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ని నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచిన ప్రవీణ్ మొదటిసారిగా అచ్చంపేట మండలం రావడంతో కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి , సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేశారు. డప్పు వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ గుర్రపు రథంపై ఊరేగించారు. అనంతరం స్నేహ హస్తాల ఆధ్వర్యంలో చెరుకుంపాలెంలో మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఆ తర్వాత అచ్చంపేటలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ అత్యధిక మెజారిటీతో నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆశీర్వాదం, జి.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఎం.గిరిబాబు, బాపిరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామ శేషగిరిరావు

ఎంఎఎం ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసనపల్లి గ్రామ పరిధిలోని ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో శనివారం కళాశాల 17 వార్షి కోత్సవం, ఫేర్వెల్ డే వేడుకలు అట్ట హాసంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ జనరల్ మేనేజర్ ఎ.రామరాజు,రెవరెండ్ ఎఫ్ ఆర్ సుందర్ బాబు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చదువుతో పాటు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయిలో నిలిచి కళాశాలకు, తల్లి దండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రామ శేషగిరిరావు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రముఖ కంపెనీలలో ప్రతినిధులుగా వ్యాపార వర్గాలలో ఉన్నత స్థానంలో నిలిచారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రసాదరావు మాటాడుతూ ఈ ఏడాది తమ కళాశాల విద్యార్థులు ప్రఖ్యాత ఫార్మసీ కంపెనీలలో 60 మందికి పైగా కొలువులు సాధించారన్నారు. పల్నాడు ప్రాంతానికి చెందిన అన్ని వర్గాల విద్యార్థులకు సాధారణ ఫీజులతో నాణ్య మైన విద్యా బోధన ఎం.ఎ.ఎం కళాశాల ప్రత్యేకమన్నారు. ఆటల పోటీలలో ప్రతిభ చాటిన విద్యా ర్థులకు బహుమతి ప్రదానం చేశారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ పి రాయన్న, కె నాసరయ్య, ఎం.రామ్మోహనరావు, కె వీర రాఘవులు, బి కోటేశ్వరరావు, దరువూరి శ్రావ్య మాట్లాడారు.

స్కీమ్ వర్కర్లకు.. తొలగింపు భయం!

- పాలక పార్టీ నాయకులు గ్రామాల్లో చిరుద్యోగులను మార్చే యత్నం
- స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపండి : ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రస్తుత పాలక పార్టీ నేతలు గ్రామాల్లో చిరుద్యోగులను మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో, స్కీమ్ వర్కర్లు భయపడుతున్నారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, యానిమేటర్లు, క్షేత్ర సహాయకులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది పది నుండి పదిహేనేళ్లుగా పని చేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలు అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ,పెదకూరపాడు ఉన్నాయి. వైసిపి హయాంలో స్కీమ్ వర్కర్లను కొన్నిచోట్ల మార్చారు. పాలక పార్టీకి చెందిన స్థానిక నాయకులు, చిరుద్యోగులను మార్చేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. డ్వాక్రా యానిమేటర్లు డ్వాక్రా మహిళ ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి. అమరావతి మండలంలో 48 మంది, అచ్చంపేట మండలంలో 40, బెల్లంకొండ మండలంలో 18, క్రోసూరు మండలంలో 40, పెదకూరపాడు మండలంలో 36 మంద యానిమేటర్లు ఉన్నారు. ప్రతి నెలా ఒక్కొక్కరి జీతం రూ.8 వేలు. మరో రూ.2,000 గ్రామైక సంఘం లాభాల్లో ఉంటే ఇస్తారు. ఒక్కొక్క యానిమేటర్‌కు (విఓఏ) 30 గ్రూపులు ఉండాలి. ఆ గ్రూపు సభ్యులను పొదుపులు చేయించడం, రుణాలు ఇప్పించడం, ఇచ్చిన రుణాలను రికవరీ చేయించే బాధ్యత ఉంటుంది. రుణాలు మంజూరు చేసే విషయంలో యానిమేటర్లు చేతివాటం ప్రదర్శిస్తారని , రూపాయి నుంచి నాలుగు రూపాయల వరకు కమిషన్ తీసుకుంటారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో, స్థానికంగా ఉంటూ ఉపాధి పొందటానికి అవకాశాలున్నాయి. యాని మేటర్ ద్వారా డ్వాక్రా సభ్యులను సభలకు విని యోగించుకోవడం, వారి ద్వారా పార్టీలవైపు ఆకర్షించే ప్రయత్నం చేయడం చేస్తారు. ఈ క్రమంలోనే అధికారంలో ఏ పార్టీ వారు ఉంటే వారు మార్పులు చేర్పులు చేస్తుం టారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు లేని సందర్భంలో ఉపాధి కల్పించడానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనులు నిర్వహిస్తుంటారు. ఈ పనులు చేయించడానికి గ్రామానికి ఒకరు క్షేత్ర సహాయకుడిని నియమించారు. ఇది కూడా రాజకీయ ఉపాధి పునరావాస కేంద్రంగా పార్టీలు మార్చు కున్నాయి. ఉపాధి పనులు కూడా సక్రమంగా అమలు చేస్తే పార్టీకి ప్రయోజనకరంగా ఉంటుందని భావి స్తున్నారు. దీంతో వైసీపీకి బహిరంగంగా మద్దతు పలికి ప్రచారం చేసిన వారిని తొలగించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మిగతా స్కీమ్ వర్కర్లకు కూడా ఇలాంటే పరి స్థితే ఉంది. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వారిని తొలగించ కుండా కొనసాగించాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయలంలో వినతిపత్రం అందజేస్తున్న స్కీమ్ వర్కర్లు, సిఐటియు నాయకులు జి. రవిబాబు

స్కీమ్ వర్కర్లను తొలగించొద్దు

ప్రభుత్వం మారిన ప్రతిసారి స్కీమ్ వర్కర్లను తొలగించడం సబబు కాదని సిఐటియు జిల్లా నాయకులు గంజిమాల రవిబాబు అన్నారు. 10 సంవత్సరాలు 15 సంవత్సరాలు నుంచి ఒకే వృత్తిలో చేసే వారిని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఉపాధి అంతంతమాత్రంగా ఉన్న క్రమంలో తొలగిస్తే ఏం పని చేసి జీవిస్తారన్నారు. మార్పులు చేర్పులు లేకుండా ఉన్నవారిని యధావిధిగా కొనసాగించాలని కోరారు. దానికి పకడ్బందీగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు నిలుపుదల చేయాలన్నారు. ఇటువంటి తొలగింపులు ఆపకపోతే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు.

తిరునాళ్ల పనుల పరిశీలన

ప్రజాశక్తి-వినుకొండ

ఈ నెల 17వ తేదీన వినుకొండ కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి తొలి ఏకాదశి పండుగను పుస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చిన్నకొండపై జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినుకొండ మునిసిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, డి.వెంకయ్య ఆధ్వర్యంలో పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. కొండ మెట్ల వద్ద వేంచేసియున్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల వద్ద నుండి మెట్ల మార్గంలో చిన్న కొండ వరకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారని, తాగునీరు, అన్న ప్రసాదాలు, మజ్జిగ తదితర స్టాల్స్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించా ల్సిందిగా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణంలో ఉండటం వలన, ఉత్సవ విగ్రహాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఘాట్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారని, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. కుల మతాలకతీతంగా జరిగే తొలి ఏకాదశి కొండ పండుగను ప్రజ లందరూ కలిసి విజయవంతం చేయాలని కోరారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టిడిపి నాయకులు పివి సురేష్ బాబు, ఆయుబ్ ఖాన్ ఉన్నారు.

వినుకొండ కొండపై జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జివి ఆంజనేయులు

కార్పొరేట్‌కు దీటుగా వంద పడకల ఆస్పత్రి

- ఆస్పత్రిలో రోగులను కలిసిన ఎమ్మెల్యే పుల్లారావు
- ఆస్పత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో సమీక్ష
- వైద్యులు, సిబ్బంది,వైద్య పరికరాలను సమకూర్చాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా స్థానిక వంద పడకల ఆస్పత్రిని తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ సహకారంతో పట్టణ ప్రజ ల వైద్య అవసరాలకు పెద్దదిక్కుగా ఆ ఆస్పత్రిని త్వరలోనే సకల వసతులతో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. శనివారం చిలకలూరిపేట ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోకి వెళ్లి రోగులకు అందుతున్న సేవలు, వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. విభాగాల వారీగా సమస్యలు, ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, సిబ్బంది, ఇతర వివరాలు తెలుసు కున్నారు. అనంతరం ఎమ్మెల్య మాట్లాడుతూ చిలకలూరిపేటలో తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.18.57 కోట్ల నాబార్డు నిధులతో ఈ 100 పడకల ఆస్పత్రినిర్మాణం ప్రారంభించా మన్నారు. చుట్టుపక్కల నుంచి వచ్చే పేదలు, చిలకలూరి పేటలో ఎక్కువగా ఉండే దిగువ, మధ్యతరగతి కోసమే ఈ ఆసుపత్రిని మంజూరు చేయించి నిధులు కూడా తీసుకొచ్చినట్లు చెప్పారు. వైసిపి హయాంలో ఐదేళ్లుగా పనులన్నీ నిలిచిపోయాయని, ఆస్పత్రికి పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది, పరికరాలు సమకూర్చక పోవడం దారుణమన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే విడదల రజిని ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండి కూడా ఈ ఆసుపత్రి గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఆస్పత్రి పరిసరాలు బాగుండాలని వైద్యులకు కూడా సూచించామని, అవసరమైన గదులకు ఏసీ సౌకర్యం కూడా కల్పించాలని సూచించారు. ఈ ఆసుపత్రిలో వైద్యుల, సిబ్బంది కొరత ఉంటే కొంత మందిని డిప్యుటేషన్‌పై పంపించారని, అవన్నీ చక్కదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యుల, సిబ్బంది ఇబ్బందులను వెంటనే పరిష్కరిస్తామని, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు కావాల్సిన పరికరాలను కూడా సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మెడికల్ స్టోర్‌లో ఏసీ సౌకర్యం లేదని, తక్షణమే దాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రక్తనిధి కేంద్రానికి కావాల్సిన మౌలిక వసతులు, మ్యాన్‌పవర్ ఇవ్వాలన్నారు. జాతీయ రహదారి పక్కనే ఉంది కనుక ట్రామా కేర్ సెంటర్ ఉంటే ప్రమాదాల కేసులకు ఉపయోగపడుతుందన్నారు. మార్చురీ బాక్సు ఒకటే ఉందని చెప్పారని, మరో రెండు కావాలని అడిగారన్నారు. అంబులెన్స్, పోలీస్ అవుట్ పోస్ట్ కూడా ఏర్పాటు చేయాలని కోరారని, అవన్నీ పరిశీలిస్తామని, చిలకలూరిపేట వంద పడకల ఆస్పత్రిని ఉన్నతమైన ప్రాంతీయ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలంటే సరిపడా వైద్యులు, సిబ్బందితో పాటు వైద్య పరికరాలను సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యశ్రీ స్థానంలో ఎన్టీఆర్ వైద్యం తీసుకొచ్చామని, నెల రోజుల్లో ఆరోగ్య బీమా రానుందని చెప్పారు.

ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు

ఇరిగేషన్ శాఖ తీరు ఇలా... సాగునీరు పారే దెలా...

- కాల్వల్లో తొలగని అడ్డంకులు
- రూ.5కోట్లకు 8వ తేదీన టెండర్ ఖరారు
- 10న సాగునీరు విడుదల
- గుత్తేదారుని వివరాలే తెలియవంటున్న అధికారులు

ప్రజాశక్తి-తెనాలి

అధికారుల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారుతోంది. ఉన్నతాధికారుల మధ్య నెలకొన్న పరిస్థితుల ప్రభావం రైతులపై పడుతోంది. కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ కింద దాదాపు రూ.5కోట్ల విలువైన పనులకు సంబంధించి టెండర్లు ఖరారైనా, టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ల వివరాలు అధికారులకు తెలియకపోవటం వారి సమన్వయం లోపానికి అద్దం పడుతుంది. ఒకవైపు నీటి విడుదల జరిగినా, పనులు ఎక్కడికక్కడ పేరబెట్టడంతో అడుగడుగునా రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నెల రోజులు ఆలస్యంగా సాగునీటి విడుదల జరిగినా, ఆ కాస్త నీరు కూడా దిగువ ప్రాంత రైతులకు చేరే పరిస్థితి లేదు. కృష్ణా వెస్ట్రన్ డెల్టాలో సాగునీటి విడుదల, రైతుల సమస్యలు, అధికారుల మధ్య సమన్వయ లోపం వివరాలిలా ఉన్నాయి. ఇరిగేషన్ శాఖలో అధికారుల మధ్య కోల్డ్ వార్ నడుస్తోందన్నది సమాచారం. ఒకరంటే ఒకరికి గిట్టడం లేదని కార్యాలయ సిబ్బందే విమర్శలు గుప్పిస్తున్నారు. సమిష్టిగా పనిచేయాల్సిన అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం సాగునీటిని జూన్ మొదటి వారంలో అందించాలి. అయితే ఈనెల 10న సాగునీటిని విడుదల చేశారు. అది కూడా ఐదు టిఎంసిల నీటినే విడుదల చేశారు. గత ప్రభుత్వంలో గతేడాది జూన్ ఏడున 42 టిఎంసిల నీటిని విడుదల చేశారు. గతంతో పోల్చితే నీటి విడుదలలో భారీ వ్యత్యాసం ఉంది.

కృష్ణా డెల్టా పరిధిలో కాలువల మ్యాప్

ఇదిలా ఉంటే ఖరీఫ్ సీజన్‌కు సంబందించి ఏప్రిల్, మే నెలలో చేయాల్సిన పనులకు ఈనెల 8న టెండర్లు ఖరారు చేశారు. కెడబ్ల్యూ మెయిన్ కెనాల్, ఈస్ట్రన్ మెయిన్ కెనాల్, వెస్ట్ సైడ్ కెనాల్, నిజాంపట్నం, కొమ్మమూరు, కెబ్ల్యూ బ్యాంక్ కెనాల్ రేపల్లెకు సంబందించి గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు వంటివి రూ.4.98 కోట్ల అంచనాతో 86 పనులను గుర్తించి, జూన్ 21న ఆమోదించారు. జూలై ఒకటి నుంచి టెండర్లు పిలిచారు. ఎనిమిదిన టెండర్లు ఓపెన్ చేశారు. వెంటనే పదో తేదీనే నీరు విడుదల చేశారు. మరి ఒక్క రోజులో 86 పనులు ఎలా పూర్తి చేస్తారన్నది అధికారులకే తెలియాలి. పైగా ఎనిమిదిన టెండర్లు ఖరారైనా, నేటికీ పనులు ఎవరు దక్కించుకున్నారన్నది సంబంధిత అధికారులకు తెలియపోవటం ఉన్నతాధికారి ఏకపక్ష వైఖరికి, వారి మధ్య సమన్వయలోపానికి నిదర్శనంగా ఉంది. రైతులు కూడా ఈ పరిస్థితిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా కేవలం అధికారుల హడావుడి మాత్రమేనని రైతులకు మేలు జరిగేదేమీ ఉండదంటున్నారు. పనులు మమ అనిపించి కోట్లాది రూపాయల కైంకర్యానికి అధికారుల ఎత్తుగడగా విమర్శిస్తున్నారు. నీటి విడుదల జరిగినా కాలువల్లో గుర్రపుడెక్క, తూటికాడ ఎక్కడిదక్కడే ఉందని రైతులు వాపోతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు కార్యనిర్వాహక ఇంజనీర్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ఆధునీకరణకు రూ.5.95 కోట్లతో ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఈనెల 5న సచివాలయంలో ఇరిగేషన్ అధికారులతో ఇరిగేషన్ మంత్రి , సంబంధిత ఉన్నతాధికారులు సమిష్టిగా ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. రూ.300 కోట్ల నిధులను సాగునీటి కాలువలకు సంబంధించి షట్టర్ల మరమ్మతులు, కట్టలు సరి చేయటం, కాంక్రీట్ పనులు, షిల్టు తొలగించంటం వంటి పనులకు కేటాయించారు. దీనిలో భాగంగా కృష్ణా వెస్ట్రన్

కూచిపూడి లాకుల వద్ద కాల్వలోపడి ఉన్న చెట్లు

డెల్టా పరిధిలో 87 పనులను గుర్తించిన అధికారులు రూ.5.95కోట్ల అంచనాతో ప్రతిపాదించారు. ఇదిలా ఉంటే కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో కూచిపూడి లాకుల సెక్షన్ పరిధిలో దాదాపు 31వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణా వెస్ట్రన్ డెల్టాలో ఇది ఎంతో కీలకం. అయితే ఇక్కడ లాకుల నిర్వహణ పూర్తి అధ్వాన్నంగా ఉంది. కనీసం లస్కర్లు లేరు, ఏఇ లేరు, ఉన్నది ఒకే ఒక్క సూపరింటెండెంట్ మాత్రమే. లాకుల వద్దే కాలువల్లో చెట్ల కొమ్మలు, మొద్దులు పడి ఉన్నాయంటే, దిగువన పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. లాకులపై పనిచేయాల్సిన లస్కర్ల వ్యవస్థనే నీరుగార్చిన అధికారులు ఏమేరకు పనులు పూర్తి చేస్తారన్నది వేచి చూడాల్సిందే.

పనులు ఎవరికి దక్కాయన్నదే తెలియదు.. పనులు ఎలా చేయించాలి?

-ఎన్‌కెవి ప్రసాద్, డిఈ, దుగ్గిరాల

టెండర్లు ఖరారు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిధిలోని అంశం. నా పరిధిలో ప్రతిపాదించిన పనులకు సంబందించి టెండర్లు ఎవరు దక్కించుకున్నారన్నది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి లిఖిత పూర్వకంగా సమాచారం ఉండాలి. కాని ఇప్పటికి నాకెలాంటి సమాచారం లేదు. సబ్ కలెక్టర్ కూడా శుక్రవారం ఉదయం ఫోన్ చేసి కాలువల పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఆయనకు ఇదే విషయం చెప్పా. అయితే కార్యాలయం ద్వారా పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించా. తనకు అధికారికంగా సమాచారం రాలేదని చెప్పారు. అయినప్పటికీ శనివారం నుంచి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల

పులిపాక హైస్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటి సీట్లు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బిఆర్ స్టేడియం వద్ద మహాకవి తిక్కన, పులిపాక హనుమంతరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరంలో పదవ తరగతి చదివిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించారని పాఠశాల హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. ఆలా పృథ్వీమనోజ్‌కుమార్ 579 మార్కులతో గుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రథముడిగా నిలిచాడన్నారు. అలాగే 566 మార్కులు సాధించిన షేక్.అయేషా ద్వితీయ స్థానం పొందిందన్నారు. పృథ్వీ మనోజ్‌కుమార్ తండ్రి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ, ఇంటివద్ద ట్యూషన్స్ చెబుతారని, మనోజ్‌కుమార్‌ను విద్యతోపాటు సంగీతం, వయోలిన్, జిమ్నాస్టిక్స్‌లోనూ నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దారన్నారు. ఈ విద్యార్థి పాడుతా తీయగా, స్వరాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నాడన్నారు.ఆయేషా తండ్రి ఇన్వర్టర్ బ్యాటరీ వర్క్స్ చేసుకుంటూ కుమార్తెను ట్రిపుల్ ఐటి సీటు సాధించేలా ప్రోత్సహించాడన్నారు.ఈ సందర్భంగా ఆయా మనోజ్‌కుమార్‌ను, ఆయేషాను అభినందించారు.


నూతన కార్యవర్గం

ఎంఇఒ-2 సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఎంఇఒ-2 సంఘం నూతన రాష్ట్రకార్యవర్గం ఎన్నికైంది. శనివారం స్థానిక అరండల్‌పేటలోని గీతారీజెన్సీలో సంఘం రాష్ట్ర స్థాయి విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, సిహెచ్.సుభాష్‌చంద్రబోస్, ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర కన్వీనర్ జి.కృష్ణ, ఎన్‌టిఎ నాయకులు టిఎల్‌విఎస్ రవికుమార్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా టి.వి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సుబ్బారావు, ట్రెజరర్‌గా కె.కొండారెడ్డి, సహాధ్యక్షులుగా హెచ్.గురుప్రసాద్, మహిళా కార్యదర్శి రమామణి, గౌరవాధ్యక్షులుగా ఎస్‌విసిహెచ్.సుబ్రహ్మణ్యం, అదనపు ప్రధాన కార్యదర్శిగా మోకా ప్రకాష్, మదన్, వై.వెంకటేశ్వరరెడ్డి, సలహా డాక్టర్ రామచంద్ర ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తి చేయాలి

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కి వినతి పత్రం ఇస్తున్న భీమ్‌భారత్ నాయకుల

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్ నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని, ప్రభుత్వంతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయటానికి కృషి చేయాలని భీమ్ భారత్ నాయకులు కోరారు. శనివారం బీమ్ భారత్ నాయకులు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ భవన్ పూర్తి అయితే గ్రూప్-1, 2 వంటి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే బిఆర్ స్టేడియం ఎదురు ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టల్ నిర్మాణం 90శాతం పూర్తి అయ్యిందని మిగిలిన కొద్దిపాటి పనులు పూర్తి చేస్తే పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరం అన్నారు. క్రిస్టియన్ స్మశాన వాటిక స్థలం విషయంలో ప్రజలకు కొంత ఇబ్బంది ఉందని పరిశీలించి, న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు అన్ని విధాలుగా న్యాయం చేయటానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, బిసి మహాజన సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, బహుజన పొలిటికల్ సెంటర్ కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, బిసి బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహారావు పాల్గొన్నారు.

శంకర కంటి ఆసుపత్రిలో మాదల శకుంతల సంస్మరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు : పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రిలో మాదల శకుంతల సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాదల రత్నగిరిబాబు, జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మాదల సుధాకర్, హాస్పిటల్ సిఇఒ డాక్టర్ పి.సుధాకర్ పాల్గొన్నారు.అతిథులు, సిబ్బంది శకుంతల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రత్నగిరి బాబు మాట్లాడుతూ గతంలో శంకర ఆసుపత్రికి కోట్లాది రూపాయలు విలువ చేసే ఐదు ఎకరాల స్థలాన్ని మాదల సుధాకర్, డైరెక్టర్ మాదల శకుంతల విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సహాయక సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న రత్నగిరిబాబు

కిలాడి లేడీ ఘరానా మోసం

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి పట్టణంలో టీడ్కో గృహాలలో బ్యాంకు లోన్ల పేరుతో మహిళలను బురిడీ కొట్టించిన గుంటూరుకు చెందిన కిలేడీ లేడీ ఉదంతం శనివారం వెలుగు చూసింది. తన పేరు కొండవీటి శైలజ అని తాను లోన్లు ఇప్పిస్తానని రూ.3వేలు కడితే రూ.2లక్షల లోను ఇప్పిస్తానని, టిడ్కో గృహాల్లో నివాసముంటున్నవారిని నమ్మించింది. దాదాపు 80 మంది మహిళల నుండి రూ.3వేలు చొప్పున వసూలు చేసుకుని పరారయ్యింది. బాధితులు తాము సరోజ చేతిలో మోసపోయామని గుర్తించి లబోదిబో మన్నారు. అనంతరం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

మోసం చేసిన శైలజ

ఆళ్లకు ప్రపంచ జనాభా దినోత్సవ పురస్కారం

ప్రజాశక్తి తెనాలి

ఈనెల 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పున్నమి తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల్లో పట్టడానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు పురస్కారం అందుకున్నారు. 'జనమే భయం' శీర్షికన ఆళ్ల రచించిన వచన కవితకు ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కారాన్ని వాట్సప్ వేదికగా ఆ పత్రిక గౌరవ సంపాదకులు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ అందించినట్లు ఆళ్ల శనివారం వెల్లడించారు. సంపాదకులు సర్వేపల్లి కోటేశ్వరరావు, పత్రిక కార్యవర్గ సభ్యుల సంతకాలతో కూడిన పురస్కార ప్రదాన ధవీకరణ పత్రాన్ని కూడా అందుకున్నట్లు ఆయన తెలిపారు.

ఉప్పలపాడులో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు చింతకుంట శిరీష అజయ్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడులో ప్రసన్న సాయిరాం కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాధారణ వ్యాధులు బిపి, షుగర్, హెచ్‌బిఎ1సి, కొలెస్ట్రాల్ ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆయా వ్యాధుల బారిన పడి చికిత్స కోసం సంప్రదించిన ప్రజలకు తమ హాస్పిటల్లో 15 రోజుల పాటు ఓపి ఉచితమని, అదేవిధంగా హాస్పటల్లో చేసే వైద్య పరీక్షల్లో 30 శాతం రాయితి ఇవ్వనున్నట్లు తెలిపారు.

కుట్టుమిషన్లు అందజేస్తున్న ఇ. సంతానం, సి. తంగా రాజన్ తదితరులు

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రెప్కో బ్యాంక్ ఆధ్వర్యంలో 32 మంది నిరుపేద కాందిశీకుల మహిళలకు శనివారం కుట్టు మిషన్లు మిషన్ లు పంపిణి చేశారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వాసవీ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో రెప్కో బ్యాంక్ చైర్మన్ ఇ. సంతానం, డైరెక్టర్ సి తంగా రాజన్, వావిలాలనగర్ కు చెందిన బ్యాక్ ట్రస్టీ ఎ. మహేశ్వరీ మహిళలకు కుట్టు మిషన్లు అందచేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతూ ఇక్కడ నివసిస్తున్న కాందిశీకులకు బ్యాంకు తరపున అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామన్నారు. కార్య క్రమంలో మురళీ దాసన్, అదృష్ట లక్ష్మి నటరాజన్ ఆనందదాస్ పాల్గొన్నారు.

ఆలయ అధికారులు, అర్చకులతో మాట్లాడుతున్న సర్పంచ్ పి.బ్రహ్మనాయుడు

ఎత్తిపోతలలో తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా ఎత్తిపోతల పుణ్యక్షేత్రంలో జరిగే స్వామివారి తిరుణాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించాలని, ఆరోజు పుణ్యక్షేత్రానికి వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆలయ అధికారులకు తాళ్లపల్లి సర్పంచ్ పసుపులేటి బ్రహ్మనాయుడు సూచించారు. శనివారం ఆలయ అధికారులు , అర్చకులతో కలిసి ఆలయంలో పలు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆలయ నిర్వాహకులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సాంబయ్య, అర్చకులు దత్త కుమార్ శర్మ, సుదర్శనాచార్యులు, గ్రామ పెద్దలు బొట్టు సత్యనారాయణ, నాలం అమర్ నాగేశ్వరరావు, జూకూరి సత్యం, కోరబోయిన సుబ్బారావు, వెంకటేష్ నాయక్, చింతకాయల ఆంజనేయులు, మన్నెంకొండ శ్రీనివాసరావు, పగడాల కోటేశ్వరరావు, పసుపులేటి భాను వెంకటేష్ ఉన్నారు.

డయేరియాకి కారణం బోర్లలో నైట్రేట్

- పిడుగురాళ్ళలో పర్యటించిన మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- చికిత్స పొందుతున్న బాధితులకు పరామర్శ
- అధికారుల పనితీరుపై అసంతృప్తి
- మురుగు కాల్వలను శుభ్రపరిచిన మంత్రి

లెనిన్‌నగర్‌లోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో డయేరియా బాధితురాలిని పరామర్శించేందుకు వెళుతున్న మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

పిడుగురాళ్ళ పట్టణంలో డయేరియాకి కారణం బోర్లలో నైట్రట్ ఉండటం వల్లనే అని మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని డయేరియా ప్రభావిత ప్రాంతాలు లెనిన్ నగర్, మారుతి నగర్‌లను మంత్రి నారాయణ, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలిసి పర్యటించారు. పర్యటనలో భాగంగా స్థానిక వైద్యశాలలో డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్న బాధితులను వారు పరా మర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు, మంత్రి నారాయణకు తమ సమస్యలను తెలిపారు. డయేరియా వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని మంచినీళ్ళ ట్యాంకు శుభ్రం చేసి చాలా కాలమైందని, తాగునీటి సమస్య,వైద్య సదుపాయాలు , డ్రైనేజి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీల్లో పర్యటించి గడిచిన మూడు రోజుల వ్యవధిలో డ్రైనేజీపై అధికారులు చేసిన పనులు పరిశీలించిన ఆయన ఆసహనం వ్యక్తం చేశారు. స్వయంగా మంత్రి మురుగు కాల్వను శుభ్రం చేసి అధి కారుల పనితీరు మెరుగు పరుచుకోవాలని అన్నారు. కాలనీలోని ప్రజలతో డయేరియా వ్యాది నిర్మాలన గురించి అధికారులు చేస్తున్న పనులు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. నారాయణ మాట్లడుతూ గత రెండు రోజుల క్రితం పిడుగురాళ్ళలో పర్యటించి భాదితులను పరామర్శించా నని, డయేరియా కట్టడికి అధికారులకు సూచనలు చేసి సమస్య గురించి తెలుసు కునేందుకు నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించామన్నారు. కృష్ణా నది నీరు పంపిణీలో సమస్య రావడం వల్ల 5 రోజల పాటు సరఫరా నిలిపివేయడంతో స్థానికంగా ఉన్న 10 పవర్ బోర్లు , 36 చేతి పంపుల ద్వారా ఆ ప్రాంతాలలో నీటి సరఫరా జరిగిందని, ఆ బోర్లలో సేకరించిన నీటి నమూనాలలో 8 పవర్ బోర్లలో నైట్రేట్ గుర్తించినట్లు చెప్పారు. మిగిలిన 36 చేతిపంపులకు కూడా పరీక్షలు నిర్వహంచాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. లెనిన్ నగర్‌లో శనివారం కూడా 7 డయేరియా కేసులు నమోదయ్యాయని, వైద్య సదుపాయాలు మెరుగుపరిచామని, రూ.10 లక్షల నిధులు కూడా కేటాయించి నట్లు చెప్పారు. వర్షా కాలం కావడంతో మురుగునీరు ఎక్కువుగా ఉంటుందని, పైప్‌లైన్లకు లీకుల ఉండటంతో నీరు కలుషితమవుతుందని, పట్టణంలో మెత్తం 175 కిలోమీటర్ల తాగునీటి పైప్‌లైన్ ఉందని, లెనిన్ నగర్ ,మారుతి నగర్ ప్రాంతాల్లో 15 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంపై రివ్యూ నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాచి చాల్లార్చిన నీరు తాగాలని సూచించారు.ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్య వచ్చినప్పుడు వేగంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నా మన్నారు. గత ప్రభు త్వం లాగా సమస్యలను వదిలేయలేదని అన్నారు. డయేరియాపై ప్రజలకు అవ గాహన కల్పిస్తూ, వంద శాతం నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు.

మురుగు కాల్వను శుభ్రం చేసిన మంత్రి

పట్టణంలోని డయేరియా ప్రాంతాలైన లెనిన్‌నగర్,మారుతీనగర్ ప్రాంతాలలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ మురుగు కాల్వలను అధికారులు సరిగా శుభ్రం చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.మంత్రే స్వయంగా మురుగుకాల్వలోని మురుగును తీసి కాల్వను శుభ్రం చేయడంతో స్థానికులు,అధికారులు అవాక్కయ్యారు. అధికారులు పనితీరు మార్చుకోవాలని మరో మూడు రోజుల తరువాత మళ్ళీ వచ్చి పరిశీలిస్తామని వారికి తెలిపారు.

లెనిన్‌నగర్‌లో పర్యటిస్తున్న మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు తమ సమస్యలు చెబుతున్న స్థానిక మహిళలు

మారుతీనగర్‌లో పవర్‌బోర్‌ను పరిశీలిస్తున్న మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భవిష్యత్ తరాలకు మంచి నాయకుడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వచ్చే ఎన్నికల గురించి మాత్రమే ఆలోచించేవారు రాజ కీయ నాయకులు అని, తర్వాత తరాల గురించి ఆలోచన చేయగలిగిన వారే నాయకులని ప్రజా మేనిఫెస్టో కమిటీ కన్వీ నర్ మాదాసు భాను ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్న పద్ధతి, చేస్తున్న ప్రకటనలను చూస్తే ఆయనలో లీడర్ లక్ష ణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఇటీవల వివిధ వేదికలపై కుండబద్దలు కొట్టే విధంగా పవన్ కల్యాణ్ మాట్లా డటం అభినందనీయమన్నారు.అభిమానం పేరిట పెద్ద ఎత్తున పూలదండలకు, శాలువాలకు ఖర్చు పెట్టే డబ్బుని వృద్ధులకు, పేద విద్యార్థులకు పనికొచ్చేవి తెచ్చి నట్లయితే వారికి అందిం చడానికి వీలవుతుందన్నారు. ఇటీవల వాహనాల నెంబర్ ప్లేట్లపై 'పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా' అని రాయడాన్ని గుర్తించి చట్ట ప్రకారం వ్యవహరించాలని, చట్టం ముందు ఎం తటి వారైనా సమానమేనని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.ప్రభుత్వ కార్యక్ర మాలలో అనధికారికంగా వేదికలను పంచుకునే పార్టీ కార్యకర్తలకు ఆయన హెచ్చరికలు జారీ చేయడం లాంటివి తన ముక్కుసూటితత్వాన్ని తెలియ జేస్తుందని అన్నారు. ఇలాగే కొనసాగింబ్ చినట్లయితే భవిష్యత్ తరాలకు మంచి నాయకుడిగా, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే యువతకు మార్గదర్శకులుగా పవన్ కల్యాణ్ ఉంటారని అన్నారు.

డ్రైనేజీలో మురుగు తొలగింపు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ టి. సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రైనేజీలోని మురుగును శనివారం తొలగించారు. ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ వర్షా కాలం దృష్ట్యా దోమలు ప్రబలకుండా మురుగు తొలగించినట్లు చెప్పారు.

పెనుమాకలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధానిలో భాగమైన పెనుమాకలో పారిశుధ్యం పడకేసింది. ఫలితంగా పేదలు నివశించే పలు ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అనేక మంది కీళ్ల నొప్పులు, జ్వరాలు, అతిసార లక్షణాలతో బాధపడుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి ఈ పరిస్థితి నెలకొంది. శనివారం జిల్లా మలేరియా సహాయ అధికారి శ్రీమన్నారాయణ యర్రబాలెం సబ్ సెంటర్ ఆరోగ్య సిబ్బంది పెనుమాక చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పెనుమాకలో జరిగిన సంఘటనపై ఎవరూ భయపడాల్సిన పని లేదని చెప్పారు. ప్రజలకు వైద్యసేవలు అందించడానికి అన్ని ఆధునిక పరికరాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మలేరియా పరీక్షలు నిర్వహించడానికి నిముషాల్లో ఫలితం రాబట్టడానికి కిట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇంటి ఆవరణలో, డాబాలపై వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బాధితులకు మందులు పంపిణీ చేశారు.

సిఎం చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజా

కాకాతీయ కోఆపరేటివ్ సొసైటీలో సిఎం చిత్రపటం

ప్రజాశక్తి-తెనాలి :రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగో సారి బాధ్యతలు చేపట్టిన నేపధ్యంలో ఆయన చిత్రపటం ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక కొత్తపేటలోని కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మాజీ మంత్రి, టిడిపి తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని సిఎం చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 23 సంవత్సరాలుగా అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక సేవలందిస్తున్న సొసైటీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. చైర్మన్ డిఎల్ కాంతారావు మాట్లాడుతూ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న సిఎం అన్ని రంగాలతో పాటు సహకార రంగానికి కూడా మెరుగైన ప్రోత్సాహాన్ని అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రూన్ని, మహ్మద్ ఖలీల్, టి.హరిప్రసాద్, కె.వాసుదేవనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

సినిమాటోగ్రఫి మంత్రితో 'మా ఎపి' భేటీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : ఆంధ్రాలోనే చిత్రసీమను అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని 'మా ఎపి' అధ్యక్షులు, దర్శకులు దిలీప్ రాజా పేర్కొన్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్‌ను శనివారం సెక్రటేరియట్‌లో ఆయన ఛాంబర్లో కలసి చిత్రసీమలో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చలు జరిపినట్లు దిలీప్ రాజా తెలిపారు. ఎపి మూవి ఆర్టిస్ట్ అసోసియేషన్, 24 విభాగాలు యూనియన్ ప్రతినిధులతో కలసి మంత్రితో మాట్లాడామన్నారు. ఈ సందర్భంగా దిలిప్‌రాజా మాట్లాడుతు అమరావతి సినిమా స్టూడియోస్ పేరిట 100 ఎకరాల్లో అమరావతిలోనే స్టూడి యోను నిర్మించాలని ప్రతిపాదన చేశామన్నారు. రాజ మండ్రి, విశాఖపట్నం, తిరుపతిలో కూడా స్టూడియోలు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపిన నిర్మాతలను ప్రోత్సహించాలని కోరామన్నారు. కనీసం 10 బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుకూలంగా పర్మిషన్లను గ్రాంట్ చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. దర్శకనిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు అమరావతి పరిసర ప్రాంతాల్లో నివేశనా స్థలాలను కేటాయించాలని కోరామన్నారు. ఆంధ్రాలో 1090 తెలంగాణలో 485 సినిమా ధియేటర్లను మూతపడకుండా ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని కోరామన్నారు. ఆంధ్రలో సిని పరిశ్రమ అభివృద్ధి మాత్రమే తమ ఏకైక అజెండా అని స్పష్టం చేశామన్నారు. సినిమాటోగ్రఫీ చట్టం 1952 మేరకు రాష్ట్రానికున్న స్వయం ప్రతిపత్తిలో ఆంధ్రాలోనే సిని పరిశ్రమను అభివృద్ధి చేయాలని 'మా-ఎపి' రూపొం దించిన ప్రతిపాదనను మంత్రికి అందజేసినట్లు చెప్పారు. విజయవాడ భవానీ ద్వీపం, కోనసీమలో గోదావరి తీరం, లంబసింగి, అరకు, సముద్రతీరాలు అడవులు, పచ్చటి పంట పొలాలు ఇలా ఎన్నో లొకేషన్లు నిర్మాతలకు అందుబాటులో ఉన్నాయని వివరించామన్నారు. నటులు మీసాల భాస్కర్ మాట్లాడుతూ చిన్న సినీమాలను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విన్నవించామన్నారు. నటులు మిలట్రీ ప్రసాద్ హీరోయిన్ టీనా చౌదరి మన్నే సత్యనారాయణ పాల్గొన్నారు.

మా-ఎపి ప్రతిపాదనను మంత్రి కె.దుర్గేష్ కుఅందజేస్తున్న దిలీప్ రాజా

కెఎల్ వర్శిటీలో ముగిసిన గణిత సదస్సు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ముఖ్య అతిథి జి.రవిని సత్కరిస్తున్న ఆచార్యులు

కెఎల్ డీమ్డ్ యూని వర్శిటీలో నాలుగవ అంత ర్జాతీయ గణిత విభాగ సదస్సు శనివారం ఘన ంగా ముగిసింది. ఈ సద స్సుకు ఏపీ స్కిల్ డెవలం మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్) డాక్టర్ జి. రవి ముఖ్య అతిథిగా హాజరై ఇంజినీరి ంగ్‌లో గణితం యొక్క ఆవశ్యకతను ఇతర విభాగాలతో అనుసంధానమైన సమస్యల మీద ప్రసంగించారు. పంజాబ్‌లోని జలందర్‌లోని ఎన్ఐటి లోని మ్యాథమెటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ శివరాజ్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్‌ల ద్వారా జీట్ మరియు మాస్ ట్రాన్స్‌ఫర్‌పై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కేరళ విశ్వవిద్యాలయం, కేరళలోని గణితశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ సింగ్ సమాచార సిద్ధాంతంపై ప్రసంగం చేశారు. పోస్ట్ లంచ్ సెషన్‌లో, ప్రతినిధులందరూ హైబ్రిడ్ మోడ్ ద్వారా తమ పరిశోధన ఫలితాలను సమర్పించారు. తమిళనాడులోని సవీత విశ్వవిద్యాలయంలోని మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణ కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ మరియు సైన్స్ విభాగాలలో పైథాన్ ప్రోగ్రామింగ్ అప్లికేషన్‌లతో డేటా అనలిటిక్స్‌పై ఉపన్యాసం ఇచ్చారు. డాక్టర్ కుమార్ ప్రతినిధులందరికీ పైథాన్ ప్రోగ్రామింగ్‌పై ప్రయోగాత్మకంగా తెలియజేసి విద్యార్థుల సందేహాలను నివృతిచేశారు.కార్యక్రమంలో వర్శిటీ వైస్ ఛాన్సులర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బివి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గాజుల శ్రీనివాసరావు, అందే మురళీమోహన్

ప్రజాశక్తి మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి (2024-2025) నూతన అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా అందె మురళీమోహన్, కోశాధికారిగా వడ్లమూడి శ్రీనివాసరావు నియమితులైనట్లు క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ అందె రేవంత్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో రేవంత్ వివరాలు వెల్లడించారు. రోటరీ క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి ఇసునూరు మాట్లాడుతూ నూతన రోటరీ క్లబ్ కార్యవర్గం ఆదివారం సాయంత్రం లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాలులో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు చెప్పారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేపట్టిన మరుసటి రోజు సోమవారం ఉదయం మంగళగిరి వీవర్స్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి అందె మురళీ మోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తృతపరచాలి

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

శంకర కంటి ఆసుపత్రి ద్వారా ఇప్పటివరకు పెదనందిపాడు రోటరీ క్లబ్ వారు పేద ప్రజలకు 7 వేలకుపైగా కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించ టమే కాక. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా 8 వందల యూనిట్లు రక్త దానం ద్వారా సేకరించి రోటరీ జిల్లాలోప్రథమ స్థానంలో ఉండటం హర్షణీయమే కాక ఈ ప్రాంతంలో రోటరీ క్లబ్ చేస్తున్న సేవలకు నిదర్శనం అని రోటరీ మాజీ గవర్నర్ పి శివన్నారాయణ రావు అన్నారు. శనివారం పెదనందిపాడులో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. దాతల సహకారంతో సేవలు మరింత విస్తృత పరచాలన్నారు. రోటరీ డిప్యూటీ గవర్నర్ శివరంజని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పెదనందిపాడురోటరీ క్లబ్ సేవలో ప్రశంసనీయమని ఈ క్లబ్ ను ముందుండి నడిపిస్తున్న పి. లక్ష్మీనారాయణ ను వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నూతన సభ్యులచే వారు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షులు శివప్రసాద్ శానిటరీ వర్కర్ కు నూతన వస్త్రాలు అందజేశారు.

నేడు జీర్ణకోశ వ్యాధులపై ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు : అవగాహన ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఆరోగ్య సభలో భాగంగా నేడు లివర్, జీర్ణకోశ వ్యాధులపై సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఆరోగ్య సభ జరుగుతుందన్నారు. ఈ సభలో రమేష్ హాస్పిటల్స్‌కి చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎంఎన్‌వి నీలేంద్ర యశస్వి ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు. గ్యాస్ట్రిక్ సమస్యలతోపాటు కామెర్లు, కాలేయవ్యాధి, రక్తపు వాంతులు, హెపటైటిస్ బి అండ్ తదితర విషయాలపై డాక్టర్ నీలేంద్ర యశస్వి అవగాహన కలుగ చేస్తారని, సందేహాలు నివృత్తి చేసారన్నారు. కావున ఆరోగ్యాభిలాషులు అందరూ ఈ సభకు హాజరు కావాలని కోరారు.

నేడు పెదనందిపాడులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

గుంటూరు ఆదిత్య మల్టీస్పెషల్టి హాస్పిటల్ వారు పెదనందిపాడు శివాలయం మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట .వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ యజమాన్యం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అనుభవంగాల డాక్టర్లచే ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా యాంజియోగ్రామ్,స్టంట్సు, బైపాస్ సర్జరీ ఉచితంగా చేయబడుతుందన్నారు ఈసీజీ మరియు రూ.1500 విలువ గల గుండె స్కానింగ్ ఉచితంగా చేసి అవసరమైనచో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ గుంటూరు వారిచే నిబంధనల మేరకు ఉచిత సేవలు అందించబడుతాయన్నారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

నేడు ఉచిత ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి సుందరయ్యనగర్ మానవసరోవరం ధ్యాన ఆశ్రమంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి తెలిపారు. ఎటువంటి మందులు, సైడ్ ఎఫెక్ట్స్ ఫ్రీక్వెన్సీ థెరపీ ద్వారా శారీరక, మానసిన అనారోగ్యాలను తగ్గించుకోవచ్చని చెప్పారు. ఇందుకు ప్రముఖ జర్మనీ శాస్త్రవేత్త మార్కెస్ అనేక పరిశోధనలు చేసి హిలీ అనే చిన్న డివైజ్ కనుక్కొని ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్ల మందికి ఆరోగ్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. అలాగే మరో ఫ్రీక్వెన్సీ థెరపిస్టు టైమ్ వీవర్ స్పెషలిస్టు జర్మనీలో ట్రైనింగ్ పొంది డాక్డర్ రావి నారాయణ (ఎండి) ఈ వైద్యశిబిరంలో పాల్గొని ఉచితంగా వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత వైద్యశిబిరం జరుగుతుందని చెప్పారు. .

దుండగులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

నంద్యాల జిల్లా పగిడియాల మండలం, ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాల్మీకి బోయ బీసీ బాలిక వాసంతి పై హత్యాచారానికి పాల్పడ్డ దుర్మార్గులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్కులో ఆడుకుంటున్న అన్నెం పున్నెం ఎరుగని 9 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం-ఆపై హత్య చేసి, కాలువలో పడేసామంటున్న ఆ మానవ మృగాలపై చట్టపరమైన గట్టి చర్యలు గైకొనాలన్నారు. శోకసంద్రంలో మునిగిపోయిన వాసంతి కుటుంబ సభ్యులను, ప్రభుత్వ పెద్దలు వెంటనే కలిసి, పరామర్శించి, ఓదార్చాలన్నారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

నేడు గంగానమ్మ దేవస్థానంలో అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి బోసుబొమ్మ సెంట ర్‌లో పున: నిర్మాణం అయిన గంగా నమ్మ తల్లిదేవస్థానం ప్రారంభం సందర్భ ంగా ఆదివారం గౌడ కల్యాణ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వా హకులు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొంటారని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులను అభినందిస్తున్న అన్నా నందకిషోర్ తదితరులు

సిఎ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సిఎ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అత్యధిక మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారని సంస్థ ఛైర్మన్ సిఎ అన్నా నందకిషోర్ తెలియజేశారు. ఎ.సాయివెంకట ధీరజ్ 435 మార్కులు, ఎన్.స్తుతి హర్షిత 360 మార్కులు, కె.బాలచందర్ 332, జె.ప్రియకుమారి 326 మార్కులు, డి.లక్ష్మీనరసింహ 322 మార్కులు, కె.దుర్గ 315 మార్కులు వంటి టాప్ మార్కులు సాధించారన్నారు. ఇంటర్ నుండి సిఎ, సిఎంఎ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణతో కూడిన కోచింగ్ అందించటం ద్వారా విద్యార్థులు ఆలిండియా టాప్ ర్యాంకులు సాధించారన్నారు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారికి జులై 21 నుండి తరగతులు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా టాపర్లను ఛైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు అభినందనలు తెలిపారు.

ఆగస్టు మొదటి వారంలో అన్నా క్యాంటీన్లు

ప్రజాశక్తి-గుంటూరు

నగరాలులో సిద్ధమవుతున్న అన్నా క్యాంటిన్

ప్రతి పేదవానికి నాణ్యమైన అల్పాహారం, భోజనం నామ మాత్రపు ధరకే అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంకల్పించిన అన్నా క్యాంటిన్లను గుంటూరు నగరంలో ఆగస్ట్ మొదటి వారానికి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో జరుగుతున్న మరమ్మతు పనులపై శనివారం ఇంజినీరింగ్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ తగు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా పున్ణప్రారంభం చేయనున్నదని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 8 అన్నా క్యాంటీన్లను వినియోగంలోకి తీసుకురావడానికి ఇప్పటికే రూ.74 లక్షలతో టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యతా ప్రమాణాల్లో రాజీలేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. క్యాంటీన్లు ఉన్న ప్రాంతాల ఏఈలు పనులను వేగంగా జరిగేలా బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా పెయింటింగ్, విద్యుత్‌వైరింగ్, ఫ్యాన్లు, స్విచ్‌బోర్డ్‌లు, లైట్లు, గ్లాస్ డోర్స్, ఫ్లోర్ మరమ్మతులు చేపట్టాలన్నారు. హ్యాండ్‌వాష్ పాయింట్స్, నీటిసౌకర్యం పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిపై డిఈఈలు, ఈఈలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, కమిషనర్ చాంబర్‌కి నివేదిక ఇవ్వాలన్నారు.

మాట్లాడుతున్న గాంధీ రామ్మోహనరావు

ఎల్ఐసిని ప్రైవేటీకరించొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

ఎల్ఐసీని ప్రైవేటీకరించవద్దని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ సంఘం మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు ఎడ్లపల్లి గాంధీరామ్మోహన్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు నగరంలోని పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో శనివారం ఎల్ఐసి ఏజెంట్ల ఆర్గనైజేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులను ఉద్దేశించి గాంధీరామ్మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఏజెంటుకు జీవించేందుకు బీమాఉండాలన్నారు. ఏజెంట్‌కు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కేరళ తరహా ఏపీలో కూడా వెల్ఫేర్ పండు ఏర్పాటుచేసి పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఏజెంట్లకు పాతకమిషన్ విధానాన్ని అమలు చేయాలని పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మెడికల్ కార్డులను అందజేయాలని డిమాండ్ చేశారు. రూ.1.8లక్షల లోపు ఆదాయం ఉన్న ఏజెంట్లకు థాంక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి సంఘం నాయకులు పి.ఎల్ నరసింహారావు, జి.కిషోర్‌కుమార్, వి.వి.కె సురేష్, కె.ఉదయలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మచిలీపట్నం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

కౌలు రైతులకు అందని వ్యవసాయం

వీక్షణం

కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు చొరవ చూపడం లేదు. సాగు పెట్టుబడి కోసం కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర రుణ ప్రణాళికలో కనీసం 10 శాతం తగ్గకుండా కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని గత కొన్నేళ్లుగా తీర్మానాలు చేస్తున్నా ఆచరణకునోచుకోవడం లేదు. భూమి లేని కౌలు రైతులు సంక్షోభంలో చిక్కుకున్నారు. సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఆదాయం తగ్గిపోతోంది. ప్రభుత్వం నుంచి కౌలురైతులకు తగిన భరోసా కొరవడింది. ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరిలో గరిష్టంగా 70 నుంచి 80 వేల మందికి సిసిఆర్‌సి కార్డులు ఇస్తున్నారు. కౌలు రైతులకు మెరుగ్గా ఉన్న 2011 కౌల్దారి చట్టాన్ని తొలగించి వైసిపి ప్రభుత్వం 2019లో కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు ఏ సాయం కావాలన్నా భూ యజమాని అంగీకారం తప్పని సరిగా మారింది. భూ యజమాని అంగీకారపత్రంతో సాగు ధృవీకరణ పత్రాలు జారీ చేయాలన్న నిబంధనల మేరకు సాగు ధృవీకరణ పత్రాలు (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగడం లేదు. సాగు ధృవీకరణ పత్రాలు రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు జారీ చేసినా బ్యాంకర్లు మాత్రం రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు.

2024-25 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 36 వేల మందికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు ఇచ్చినట్టు తెలిసింది. కనీసం లక్ష మందికి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఈమేరకు అధికారులు ప్రయత్నాలు చేయడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లా మొత్తం మీద కేవలం 30 వేల మందికి రూ.90 కోట్ల మేరకు రుణాలు ఇచ్చారు. కౌలు రైతులకు ఒక్కొక్కరికి కనిష్టంగా రూ.20 వేలు, గరిష్టంగా రూ.30 వేలకు మించి పంట రుణాలు ఇవ్వడం లేదు. అంతేగాక ఐదుగురు సభ్యులు ఉండే జాయింట్ లయబులిటి గ్రూపు (జెఎల్‌బి)నకు గరిష్టంగా రూ.లక్ష మాత్రమే రుణాలు ఇస్తున్నారు. సి.సి.ఆర్.సిలు లేకపోవడం వల్ల చాలా మందికి ప్రభుత్వ సంక్షేమపథకాలు కూడా అందడంలేదు. సిసిఆర్‌సిలు ఉన్న ఓసి రైతులకు గత ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం లేదు. బీమా సదుపాయం సొమ్ము భూ యజమాని ఖాతాల్లో జమ అవుతుంది. ప్రభుత్వం సేద్యానికి అందిస్తున్న సబ్సిడీలు కౌలు రైతుకు అందడం లేదు. పండించిన పంటను అమ్ముకోవాలన్నా గుర్తింపుకార్డు లేక భూ యజమాని పేరుతోనే అమ్ముకోవలసి వస్తుంది. కొంత మంది అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఈ క్రాప్, ఈకేవైసి సదుపాయం కౌలు రైతులందరికి లేకపోవడం వల్ల వీరికి ప్రభుత్వం నుంచి నేరుగా రావాల్సిన వివిధ సదుపాయాలు అందడం లేదు. భూ యజమానులకు రుణాలు ఇస్తున్న బ్యాంకర్లు వాస్తవ సాగు దారులుగా ఉన్న కౌలు రైతులకు రుణాలు ఇవ్వకపోవడంపై గత కొన్నేళ్లుగా రైతు సంఘాలు ఆందోళన చేస్తున్నా గతఐదేళ్లకాలంలో వైసిపి ప్రభుత్వం పట్టి పట్టన్నట్టు వ్యవహరించింది. సిసిఆర్‌సి కార్డు ద్వారా జెఎల్‌బి గ్రూపులకు రుణాలు ఇచ్చినా ఒక్కొక్కరికి రూ.1.60 లక్షల చొప్పున గ్రూపు మొత్తానికి రూ.8లక్షలు హామీ లేని రుణం ఇవ్వాలని కౌలు రైతు సంఘాల నాయకులు కోరుతున్నాయి. నూతనంగా అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అయినా పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ పథకంతోపాటు 2011 చట్టం ప్రాతిపదికన గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రతి రైతును ఈకేవైసి, ఈ క్రాప్ చేసి పంట కొనుగోలు, బీమా సదుపాయాలు తమకు వర్తింపచేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.

(ఎ.వి.డి.శర్మ)

జిజిహెచ్‌లో ఇఎన్‌టి, కార్డియాలజీ వైద్యుల అరుదైన చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈఎన్‌టి, కార్డియాలజిస్టు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ శనివారం మీడియాకు తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గౌస్ పీర్ ముక్కు వ్యాధితో గత నెల 22 వ తేదీన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడన్నారు. అంతకు ముందు పలు ఆస్పత్రుల్లో చూపించినా వైద్యులు శస్త్రచికిత్సకు సుముఖత చూపలేదు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం బాగ చేస్తున్నారని తెలిసి ఈ యన్ టి విభాగానికి వచ్చారు. ఈ ఎన్ టి ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్ రోగిని చూసారు. ఆ తర్వాత వివిధ పరీక్షలు చేశారు. రక్తం వచ్చే గడ్డ ముక్కు నుంచి నోట్లోకు వెళ్లిందని నిర్ధారించారు. దీని పరిణామం 10 ఇన్‌టు 10గా ఉందని గుర్తించారు. ఈ గడ్డ ను తొలగించాలంటే చాలా రిస్క్ తో కూడుకున్నాడని భావించారు. ఒక్కొక్కసారి గుండె కు సంబంధించి కూడా సమస్యలు ఉంటాయని భావించారు. ఈ రిస్క్ గురించి కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతి తీసుకుని గత శుక్రవారం ఈ యన్ టి, కార్డియాలజీ విభాగం వైద్యులు సంయుక్తంగా ఆపరేషన్ చేశారు. తర్వాత ఎండో స్కోపి, మైక్రో డబ్రిడర్ పరికరాల తో రక్తం వచ్చే ట్యూమర్‌ను తొలగించారు. దాంతో పేషంట్ ఆరోగ్యం కుదుట పడింది. రెండు మూడు రోజుల్లో పేషంట్ ను డిశ్చార్జి చేస్తున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ ఆపరేషన్ లో కార్డియాలజీ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ శ్రీకాంత్, ఈ యన్ టి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవీంద్ర బాబు, డాక్టర్ అరుణ్ కుమార్, మత్తు వైద్యుడు శ్యాం కుమార్‌లు పాల్గొన్నారు. ఆపరేషన్ విజయవంతం చేసిన వైద్యులను సూపరింటెండెంట్ అభినందించారు.

పతనమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దండి

రిటైర్డ్ ఐఎయస్ అధికారి డాక్టర్ పి.వి.రమేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాట్లాడుతున్న డాక్టర్ పి.వి.రమేష్

గత ఐదు ఏళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనమైందని అప్పులు భారీగా పెరిగాయని రిటైర్డు ఐఎఎస్ అధికారి డాక్టర్ పి.వి. రమేష్ పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన గుంటూరులో జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివద్ధి కార్యాచరణ అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న డాక్టర్ పి.వి. రమేష్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిరోజు 75 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లిస్తున్నామని మరో 175 కోట్ల రూపాయలు ప్రతిరోజు అప్పులు చేసే దుస్థితికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారిందన్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ప్రజలను కులాల ప్రాతిపదికగా విభజించి ఓట్లు పొందాలని భావిస్తున్నా యన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో ఉత్పాదకతను పెంచి, దళారి వ్యవస్థను తొలగించాలన్నారు. ఇంగ్లాండ్ లో అమలవుతున్న వైద్య విధానం మనదేశంలో కూడా అమలు చేస్తేనే పేదలకు మంచి వైద్యం లభిస్తుందన్నారు. మట్టి, ఇసుక, మైనింగ్ లాంటి సహజ వనరులను పాలకులు దోచుకుని పథకాలతో ప్రజలను తృప్తిపర్చడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రెండు వేల జనాభా ఉన్న గ్రామాలలో ప్రతి సంవత్సరం సచివాలయ సిబ్బంది,వాలంటీర్లకు 60 లక్షల రూపాయలు జీతాల రూపంలో చెల్లిస్తున్నారాని ఆయా గ్రామాలలో 60 లక్షల రూపాయల అభివద్ధి పనులు కూడా జరగడం లేదన్నారు. రేషన్ బియ్యాన్ని 98 శాతం లబ్ధిదారులు ఉపయోగించుకోవడం లేదని కిలో బియ్యం ఏడు రూపాయలు నుండి పది రూపాయలు వరకు మధ్య దళారీ లకు అమ్ముతూ అవినీతి పెరగడానికి దోహదపడుతుందన్నారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు పి. రామచంద్ర రాజు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, మానవత సంస్థ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, మానవత ఛైర్మన్ పావులూరి రమేష్, ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, ఎం. కోటేశ్వరరావు, ప్రవేట్ విద్యాసంస్థల ఉపాధ్యక్షులు మేకల రవీంద్రబాబు, మానవత పూర్వ కార్యదర్శి రమణబాబు ప్రసంగించారు.